సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం, 31, మే, 2023



దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం
దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. 18 మంది దివ్యాంగులకు టీవీఎస్ స్కూటీలను పంపిణీ చేశారు.

8లో..



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,110
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,554
3 శాతం జీఎస్టీతో	రూ.5,721
నవర (8 గ్రా)	రూ.45,768

గరిష్టం/కనిష్టం
38.1 /29.5

వాతావరణం
జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలులు వీచాయి. పలుచోట్ల వర్షం కురిసింది. గాలిలో 89 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఎమ్మెల్యే, మాజీ ఎంపీ



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విక్రమ్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరు/ఉదయగిరి: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు ఆత్మకూరు నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మెట్ట నియోజకవర్గాలకు మేలు జరిగేలా నిర్మిస్తున్న హైలెవల్ కెనాల్ ఫేజ్ – 1, 2 పనులకు సంబంధించి భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం విషయంలో చొరవ చూపాలని కోరారు. స్పందించిన సీఎం రైతులకు నష్టపరిహారం విషయంపై కలెక్టర్‌కు వెంటనే ఆదేశాలు జారీ చేస్తామన్నారని మేకపాటి తెలిపారు. హైలెవల్ కెనాల్ నిర్మాణంలో ఆత్మకూరు ఎగువ ప్రాంత మండలాలు, ఉదయగిరి నియోజకవర్గంలోని పలు మండలాలకు తాగు, సాగునీరు లభ్యం కానుండడంతో ఆ పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

645 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి: మండలంలోని కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 645 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి మహేష్ కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 756 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 111 బేళ్లను తిరస్కరించినట్లు వెల్లడించారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.150, సగటున రూ.199.12 ధర లభించింది. వేలంలో 10 కంపెనీలు పాల్గొన్నాయి.

సోమశిలలో 41.500 టీఎంసీలు



సోమశిల జలాశయం (ఫైల్)

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 41.500 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 187 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 3,700 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 230, దక్షిణ కాలువకు 200, కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం 94.527 మీటర్లు ఉంది.

రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు ప్రారంభం



పోటీలు జరుగుతున్న దృశ్యం

కోవూరు (విడవలూరు): మండలంలోని అలగానిపాడు గ్రామంలో నారు చినవెంకయ్య, వెంకమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. దీనికి పలు జిల్లాల నుంచి 25 ఎడ్ల జతలు విచ్చేశాయి. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలియజేశారు. పోటీలు ఫ్లడ్ లైట్ల వెలుగుల నడుమ కొనసాగుతున్నాయి. కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు సతీష్, కమలాకర్, యానాదయ్య, శ్రీనివాసులు, శ్యామ్‌ప్రసాద్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

ఒక్కసారిగా గాలివాన



దుమ్ము లేచింది



నెల్లూరులో కురుస్తున్న వర్షం



వర్షానికి ఇలా..

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఒక్కసారిగా గాలివాన బీభత్సం సృష్టించింది. ఉష్ణోగ్రతలు రోజూ 40 డిగ్రీలకు పైగా నమోదవుతుండగా మంగళవారం కాస్త తగ్గాయి. పలు మండలాల్లో మేఘాలు దట్టంగా కమ్ముకుని విపరీతమైన గాలులు వీచాయి. ఉదయగిరి, వింజమూరు, వరికుంటపాడు, దుత్తలూరు, కొండాపురం, కలిగిరి, అనుమసముద్రంపేట, మర్రిపాడు, ఆత్మకూరు, సంగం, మనుబోలు, పొదలకూరు తదితర మండలాలు, నెల్లూరు నగరంలో అకస్మాత్తుగా గాలులతో కూడిన వర్షం కురిసింది. సంగం మండలంలో పలుచోట్ల మామిడి కాయలు నేలరాలాయి. అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతుండగా వర్షం కురవడంతో ఉపశమనం పొందారు.

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

విద్యార్థులకు కానుక

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. నాడు – నేడు పథకంతో బడులు కళకళలాడుతున్నాయి. బోధనలో అనేక కొత్త విధానాలను తెచ్చారు. మధ్యాహ్న భోజన పథకంలో కొత్త మెనూ ప్రవేశపెట్టి విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందిస్తున్నారు. అమ్మఒడి పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. ఇంకా జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్నారు.

సిద్ధమవుతున్న జగనన్న విద్యా కానుక కిట్లు
- బడి తెరిచిన రోజే పంపిణీకి చర్యలు
- ఇప్పటికే స్కూల్ కాంప్లెక్స్‌లకు యూనిఫాం, బ్యాగ్‌లు, నోటు పుస్తకాల తరలింపు
- మరో వారంలో పూర్తిగా రానున్న వస్తువులు

జిల్లాలో..
ప్రభుత్వ పాఠశాలలు : 2,624
కిట్లు ఎంతమందికంటే.. : 1,92,900



జగనన్న విద్యా కానుక కిట్లు అందుకున్న విద్యార్థినులు (ఫైల్)



కొడవలూరులో వస్తువుల పరిశీలన (ఫైల్)

నెల్లూరు(టౌన్): వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ అన్ని చర్యలు తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు 8 రకాల వస్తువులను అందజేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే యూనిఫాం, బెల్ట్‌లు, బ్యాగ్‌లు, పాఠ్య, నోటు పుస్తకాలను ప్రభుత్వం జిల్లాకు 60 శాతం మేర పంపించింది. ఈ వస్తువులను జిల్లా కేంద్రం నుంచి ఆయా మండలాల్లోని స్కూల్ కాంప్లెక్స్‌లకు తరలించారు. అదే విధంగా నోటు పుస్తకాలు, బూట్లు, డిక్షనరీలు తదితర వస్తువులు కూడా మరో వారం రోజుల్లో పూర్తిస్థాయిలో జిల్లాకు రానున్నాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. వచ్చేనెల మొదటి వారంలో స్కూల్ కాంప్లెక్స్‌ల నుంచి పాఠశాలలకు విద్యా కానుక కిట్లను పంపించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యా సంవత్సరం పునః ప్రారంభమై నాలుగైదు నెలలు గడిచినా పాఠ్య పుస్తకాలు ఇవ్వని పరిస్థితి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బడుల ప్రారంభం రోజునే విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తుండటంలో పిల్లలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల నెల్లూరుకు చేరుకున్న పాఠ్య పుస్తకాలు

ఇప్పటికే చేరాయి
జిల్లాలో 37 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వాటికి కిట్లను విద్యాశాఖ అధికారులు పంపిస్తున్నారు. అక్కడి నుంచి వచ్చే నెల మొదటి వారంలో పాఠశాలలకు అందజేయనున్నారు. వచ్చేనెల 12వ తేదీన స్కూళ్లను పునః ప్రారంభించనున్నారు. అదే రోజు విద్యార్థులకు కిట్లు అందజేసేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాకు 1,00,145 బ్యాగ్‌లు, 1,38,64 బెల్టులు, 38,960 డిక్షనరీలు, 1,18,494 జతల బూట్లు చేరుకున్నాయి. ఇంకా యూనిఫాం క్లాత్ కూడా వచ్చింది. మిగిలినవి కూడా మరో వారంలో జిల్లాకు రానున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

పెరుగుతున్న సంఖ్య
జిల్లా వ్యాప్తంగా 2,039 ప్రాథమిక, 245 ప్రాథమికోన్నత, 340 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో 1,92,900 మంది విద్యార్థులు చదువుతున్నారు. సీబీఎస్‌ఈ సిలబస్, ఇంగ్లిష్ మీడియం, వర్చువల్ బోధన తదితర వాటిని అమలు చేస్తుండటంతో ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరే పిల్లల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. సుమారు 7 వేల నుంచి 8 వేల మంది వరకు చేరుతున్నట్లు విద్యాశాఖ అధికారుల అంచనా. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్లను ఉచితంగా అందజేస్తారు. యూనిఫాం కుట్టించేందుకు విద్యార్థుల తల్లి అకౌంట్లలో నగదు జమ చేయనున్నారు. పిల్లల పాదాల కొలతలను ముందుగా తీసుకుని అందుకు అణుగుణంగా బూట్లను పంపిణీ చేస్తారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 8, ఉన్నత పాఠశాల విద్యార్థుకు 14 నోటు పుస్తకాలను అందజేయనున్నారు.

నాణ్యత విషయంలో రాజీ లేదు
జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాల పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు అందజేస్తాం. దీనికి సంబంధించి ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలకు ఉత్తర్వులు జారీ చేశాం. జిల్లాకు వచ్చిన కిట్లను ఆయా మండలాల్లోని స్కూల్ కాంప్లెక్స్‌లకు పంపిణీ చేశాం. అక్కడి నుంచి పాఠశాలలకు పంపిస్తాం. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేదు. నాణ్యతతో కూడిన వస్తువులను మాత్రమే పిల్లలకు అందజేస్తాం.



– ఉషారాణి, ఏపీసీ, సమగ్రశిక్ష

అంబరాన్నంటిన సంబరాలు

- నాలుగేళ్ల పాలనపై ఉత్సాహంగా కేక్‌లు కట్ చేసిన నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా పాలన చేపట్టి నాలుగు సంవత్సరాలైన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం అంబరాన్నంటేలా సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సర్వేపల్లి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు కేక్‌లు కట్ చేశారు. మంత్రి నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన దేశానికి ఆదర్శమని తెలిపారు. నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్ రెడ్డి నివాసంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు కార్యక్రమం నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనలతో నియోజకవర్గంలో నాయకులు కేక్‌లు కట్ చేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కావలిలో భారీ మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించారు. దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల భారీ కేక్‌లు కట్ చేశారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నెల్లూరులోని తన స్వగృహంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు, సెంట్రల్ బ్యాంక్ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఉదయగిరిలో నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ సూచనలతో నాయకులు సంబరాలు చేశారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ

పొదలకూరు : గ్రామ సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా జరగాలని, అప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని నెల్లూరు ఆర్డీఓ ఎ.మలోల పేర్కొన్నారు. పొదలకూరు బిట్‌-1, 4 సచివాలయాలను మంగళవారం ఆర్డీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బంది ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, సకాలంలో సేవలు అందించాలని సూచించారు. అనంతరం మొగళ్లూరు సచివాలయానికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో భూముల రీసర్వే పూర్తయినప్పటికీ రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు స్వీకరించకుండా జాప్యం చేస్తున్నట్లు తెలిపారు. బయోమెట్రిక్ వేస్తే పాస్ పుస్తకాలను అందిస్తారన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. బరువు తక్కువగా ఉన్న వారికి వైద్య సదుపాయం, పోషకాహారం అందించేందుకు పటిష్ట ప్రణాళిక రూపొందించాలి.' అని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులతో మంగళవారం కలెక్టర్ నెల్లూరులోని తన చాంబర్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో బరువు, ఎదుగుదల తక్కువగా ఉన్న సున్నా నుంచి ఆరేళ్ల లోపున్న పిల్లల ఆరోగ్యంపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెల 1 నుంచి 10వ తేదీ వరకు పిల్లల బరువు, ఎత్తు, కొలతలు సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఆ పది రోజులు ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పౌష్టికాహారం లోపం ఉన్నవారిని గుర్తించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న పిల్లల వైద్యులను ప్రతి మూడు నెలలకొకసారి పీహెచ్‌సీలకు పంపించి వైద్యసేవలు అందించే విధంగా ప్రణాళిక చేయాలన్నారు. జూన్ నుంచి ఈ కార్యక్రమం అమలయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ కేన్సర్ ఆస్పత్రికి దాతల నుంచి పెద్దఎత్తున సహకారం అందుతోందన్నారు. అలాగే పిల్లల్లో పౌష్టికాహార లోపం తగ్గించడానికి స్థానికంగా ఉన్న దాతల నుంచి సహకారం తీసుకోవాలని సూచించారు. సున్నా నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి మెడికల్ క్యాంప్‌లకు తీసుకెళ్లి సర్టిఫికెట్లు జారీ అయ్యేలా చూడాలన్నారు. ఆధార్ లేని వారికి కార్డులు ఇప్పించాలని సూచించారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకానికి సంబంధించి ఆత్మకూరు, కావలి డివిజన్‌లో కంటి ఆపరేషన్లు మెరుగుపడాలన్నారు. అవసరమైన వారందరికీ కళ్ల జోళ్లు అందేలా చూడాలన్నారు. సమావేశంలో డీసీహెచ్ ఏసీ రమేష్‌నాయక్, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష పీడీ ఉషారాణి, అంధ నివారణ సొసైటీ డాక్టర్ శార్వాణి, జిల్లా టీబీ కంట్రోల్ అధికారి వెంకట ప్రసాద్ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సెలీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.

15 లోగా రికార్డులు సిద్ధం చేయాలి
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేలో రెండో విడత ఎంపిక చేసిన గ్రామాలకు సంబంధించి వచ్చే నెల 15వ తేదీలోగా పక్కాగా భూ రికార్డులు (డీఎల్ఆర్) సిద్ధం చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం కలెక్టర్ భూముల రీ సర్వే, మ్యుటేషన్లు, జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ మొదలైన అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పర్యటించి పరిశీలిస్తే పురోగతి ఉంటుందన్నారు. అలాగే జాతీయ రహదారులకు సంబంధించి కృష్ణపట్నం గ్రీన్‌ఫీల్డ్ ప్యాకేజీ-3, నెల్లూరు – బద్వేల్, బెంగళూరు – కడప – విజయవాడ జాతీయ రహదారికి సంబంధించి భూ సేకరణ వేగవంతం చేయాలన్నారు. భూముల రీ సర్వేలో పురోగతి తదితర అంశాలను జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం మండలాల వారీగా రీ సర్వే, కోర్టు కేసుల్లో ఉన్న జగనన్న ఇళ్ల స్థలాలకు సంబంధించి లబ్ధిదారులకు పట్టాల పంపిణీపై జేసీ సమీక్షించారు. సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, సర్వే ల్యాండ్ రికార్డుల ఏడీ హనుమాన్ ప్రసాద్, ఆర్డీఓలు శీనానాయక్, మలోల, కరుణ కుమారి, తహసీల్దార్లు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం


దివ్యాంగులకు మోటరైజ్డ్ వాహనాలు అందించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 18 మంది దివ్యాంగులకు రూ.18 లక్షల విలువ చేసే మోటరైజ్డ్ వాహనాలను జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్‌తో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల జీవన ప్రమాణాలు మెరుగుపరచి, వారు దైనందిన జీవితంలో ఎక్కడా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం మోటార్ వాహనాలను అందిస్తోందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగులకు సంబంధించి ఎక్కడా వివక్ష లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. వైకల్య శాతంతో సంబంధం లేకుండా దివ్యాంగులందరికీ రూ.3 వేలు పింఛన్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి, దివ్యాంగులశాఖ ఏడీ అక్బర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తాం

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని హరనాథపురం సెంటర్‌లో నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌ను త్వరలో ప్రారంభిస్తామని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. మంగళవారం ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి ఆర్అండ్‌బీ శాఖ మంత్రితోపాటు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, జూన్ నెలలో పూర్తి హంగులతో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగరంలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా అనేక అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో నూతన పెన్నా బ్రిడ్జి, అలాగే పెన్నా బ్రిడ్జి నుంచి ఇనమడుగు సెంటర్ 6 లేన్ల రోడ్డు, మైపాడు రోడ్డులో 4 లేన్ల రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, వేలూరు మహేష్, నీలి రాఘవరావు, పొట్లూరి రామకృష్ణఆచారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నేతాజీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

ప్రతిపక్షాలు సైతం మెచ్చే పాలన


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ప్రతిపక్షాలు సైతం మెచ్చే పాలనను అందించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం నెల్లూరులోని మేకపాటి నివాసంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మేకపాటి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో విడుదల చేసిన మెనిఫెస్టోలోని హామీని అధికారంలోకి వచ్చాక అమలు చేశారని తెలిపారు. గత నాలుగేళ్లలో ప్రతిపక్ష పార్టీలు జగనన్న పాలనపై అనేక విమర్శలు చేశాయని, ఇటీవల జరిగిన టీడీపీ మహానాడులో ఆ పార్టీ నేతలు ప్రజలకు ఏదో చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పేర్లు మార్చి మభ్యపెట్టే ప్రయత్నం చేశారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు అనుసరించి అభినందిస్తున్నారన్న విషయం మహానాడులో పరోక్షంగా వెల్లడైందని తెలిపారు. చంద్రబాబు ప్రకటించే హామీలను మళ్లీ ఇప్పుడు ప్రజలు విశ్వసించే పరిస్థితుల్లో లేరని, రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కడతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పులగం శంకర్‌రెడ్డి, గంగవరపు శ్రీనివాసులునాయుడు, కోనంకి శ్రీనివాసులునాయుడు, ఇందూరు వెంకటరమణారెడ్డి, సొసైటీ చైర్మన్ పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, కంటాబత్తిన రఘునాథరెడ్డి, రాపూరు ఆనంద్‌రెడ్డి, సయ్యద్ జమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పేదల భవిష్యత్తే లక్ష్యంగా సంక్షేమ పథకాలు


తడకలూరులో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

దగదర్తి(కావలి): పేదల భవిష్యత్తే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా వినూత్న సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దగదర్తి మండలంలోని తడకలూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఇప్పటివరకు అందిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కష్టాలు తొలగించి ఆర్థిక భద్రత కల్పించేలా పథకాలు రూపొందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామ వలంటీర్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలతో పాలనను ప్రజల ముగింటకే తీసుకువచ్చారని తెలిపారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించడం ద్వారా భవిష్యత్ తరాలకు కూడా ముఖ్యమంత్రి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): పశువైద్యాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పశుపోషణలో రైతులకు సలహాలు అందించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో పశుసంవర్ధకశాఖ అధికారులతో మంగళవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అదనపు ఆదాయాన్నిచ్చే పశువులు, గొర్రెలు, మేకలు తదితర వాటికి సరైన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు వేసి సంరక్షించాలన్నారు. పశువైద్యులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పశువిజ్ఞాన బడులు నిర్వహించి రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించాలని తెలిపారు. గొర్రెల పెంపకందారుల గురించి కలెక్టర్ ఆరా తీశారు. పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు మహేశ్వరుడు జిల్లాలో పశుసంవర్ధకశాఖ అమలు చేస్తున్న పథకాల గురించి సమావేశంలో వివరించారు. నెల్లూరు బ్రీడ్ గొర్రెలకు రాష్ట్రవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందన్నారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, వెటర్నరీ సర్జన్లు పాల్గొన్నారు.

89 మద్యం సీసాలు ధ్వంసం

- ద్విచక్రవాహనాల వేలం

కలిగిరి: పలు కేసుల్లో పట్టుబడిన 89 మద్యం సీసాలు, 9.6 లీటర్ల నాటుసారాను కలిగిరి చిన్న చెరువు సమీపంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ బి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మద్యం కేసులో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం వేశారు. ఒక వాహనాన్ని రూ.5 వేలు, మరో వాహనాన్ని రూ.3 వేలకు పాటదారులు వేలంలో దక్కించుకున్నారు. గ్రామాల్లో మద్యం అక్రమ విక్రయాలు, ఇసుక రవాణా జరుగుతుంటే 9440907523 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.


మద్యం సీసాలు ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.15



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 158
లేయర్ (లైవ్)	: 98
బ్రాయిలర్ చికెన్	: 270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 300
లేయర్ చికెన్	: 167

పశువుల దొంగతనాలకు చెక్

- అమ్మినా, కొన్నా ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

నెల్లూరు(క్రైమ్): పశువుల దొంగతనాలకు చెక్ పెట్టేందుకు జిల్లా పోలీసు బాస్ చర్యలు చేపట్టారు. పశువులను అమ్మినా, కొన్నా స్థానిక పంచాయతీ కార్యదర్శి నుంచి ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేశారు. దీంతో దొంగతనాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. జిల్లాలో పశువుల దొంగతనాలు జరుగుతున్నాయి. రైతులు వ్యవసాయం, పాల ఉత్పత్తి కోసం రూ.లక్షలు వెచ్చించి పశువులను కొనుగోలు చేస్తున్నారు. వాటిని మేతకు తీసుకెళ్లిన సమయంలోనో.. రాత్రి వేళల్లో కొట్టంలో కట్టేసిన సమయంలోనో.. గుర్తు తెలియని దుండగులు అపహరించి జిల్లాలు దాటిస్తున్నారు. రైతులు వాటి కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఒక్కో గేదె విలువ రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఉండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల బాధలను గమనించిన ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర్‌రెడ్డి పశువుల దొంగతనాలకు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఎక్కడ పశువులు కొన్నా, అమ్మినా ఆ ప్రాంత పంచాయతీ కార్యదర్శి నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవడం తప్పనిసరి చేశారు. ధ్రువీకరణ పత్రం లేకుండా పశువులను తరలించే వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. ఇటీవల నెల్లూరు రూరల్ సబ్‌డివిజన్ పరిధిలోని ఓ స్టేషన్ పరిధిలో రూ.3.50 లక్షలు విలువ చేసే జెర్సీ గేదెలు అపహరణకు గురయ్యాయి. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసు అధికారులు కేసు నమోదు చేశారు. గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన గేదెలను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దుండగులు సదరు గేదెలు తమవేనని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసినప్పటికీ ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో విచారించగా దొంగతనం విషయం వెలుగులోకి వచ్చింది. ఇది ఇలా ఉంటే చేపలు, రొయ్యల దొంగతనాలను సైతం కట్టడి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. రాత్రి వేళల్లో దుండగులు రొయ్యలు, చేపలు దొంగిలిస్తున్నారు. దీంతో రాత్రి 7 గంటల పైన ఎట్టిపరిస్థితుల్లో వాటిని పట్టరాదని రైతులకు తెలియజేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. దీంతో దొంగతనాలను సాధ్యమైనంత మేర కట్టడి చేయవచ్చని చెబుతున్నారు.

డైట్ కాంట్రాక్ట్‌కు రెండు దరఖాస్తులు

- టెండర్‌ను దక్కించుకునేందుకు ఇద్దరు పోటీ
- నేడు టెండర్లను పరిశీలించనున్న అధికారులు

నెల్లూరు(బారకాసు): ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్సపొందే రోగులకు మూడుపూటలా ఆహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నెల్లూరు జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డైట్ కాంట్రాక్ట్ కోసం అధికారులు టెండర్లను ఆహ్వానించారు. గతంలో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న రోగికి ప్రతి రోజూ మూడుపూటలా ఆహారం అందించేందుకు ప్రభుత్వం రూ.40 ఖర్చు చేసేది. ప్రస్తుతం మంచి పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ రూ.40లను రూ.80లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో అధికారులు జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డైట్ కాంట్రాక్ట్ కోసం టెండర్లను ఆహ్వానించగా ఇద్దరు టెండర్లు దాఖలు చేశారు. వీరిలో ఒకరేమో గత ఐదేళ్లుగా జీజీహెచ్‌లో రోగులకు ఆహారాన్ని అందిస్తున్న మెసర్స్ కే బీరాన్‌కుట్టి. మరొకరు హైదరాబాద్‌కు చెందిన కె.సురేష్‌బాబు. ఇతను ఇటీవల తిరుపతి, కాకినాడలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా డైట్ కాంట్రాక్ట్‌ను దక్కించుకోవడానికి టెండర్లు వేస్తే అక్కడి అధికారులు అతని అక్రమాల గురించి తెలుసుకుని టెండర్‌ను స్వీకరించలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టెండర్లను బుధవారం అధికారులు పరిశీలించనున్నారు. అయితే ఎవరికి కాంట్రాక్టు దక్కనుందో వేచి చూడాల్సిందే.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ప్రారంభం

కోవూరు: స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో మంగళవారం ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ ఓపెన్ చదరంగం పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎస్పీఎస్ఆర్ నెల్లూరు చెస్ అసోసియేషన్ అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ ఈ పోటీల్లో రాష్ట్రంలోని సుమారు 2 వేల మంది చదరంగం క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్‌గా జీవీ కుమార్ వ్యవహరించారు. ఈ పోటీలు బుధవారం కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మస్తాన్ బాబు, వి.పృథ్వీకుమార్ పాల్గొన్నారు.

దాబా హోటల్ ధ్వంసం

- మాజీ ఎమ్మెల్సీ బూదాటి సహా ప్రైవేట్ వ్యక్తుల హల్‌చల్
- దగదర్తిలో ఉద్రిక్తత

దగదర్తి(కావలి): మండల కేంద్రమైన దగదర్తిలో ఓ దాబా హోటల్ అద్దెకు సంబంధించిన వివాదం మంగళవారం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. దాబా హోటల్‌ను అద్దెకు ఇచ్చిన స్థల యజమాని, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య సుమారు 40 మందితో కలిసి హోటల్‌ను ధ్వంసం చేసి లీజుదారులను బలవంతంగా ఖాళీ చేయించేందుకు ప్రయత్నించడం తీవ్ర వివాదానికి దారితీసింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు వడ్డే వినయ్‌కుమార్ అనే వ్యక్తి దగదర్తికి చెందిన జక్కా సుధాకర్‌కు చెందిన స్థలాన్ని లీజుకు తీసుకుని రెండేళ్లుగా దాబా హోటల్ నిర్వహిస్తున్నాడు. నెలకు రూ.5 వేల చొప్పున స్థలానికి లీజు చెల్లిస్తున్నాడు. రెండు నెలల నుంచి అద్దెను రూ.10 వేలకు పెంచడంతో లీజుదారుకు, స్థల యజమానికి మధ్య వివాదం నెలకొంది. అద్దెను ఒకేసారి రూ.10 వేలకు పెంచడంతో లీజుదారులు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో స్థల యజమాని సుధాకర్, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య తమ అనుచరులతో కలిసి బలవంతంగా హోటల్‌ను ఖాళీ చేయించేందుకు ప్రయత్నించారు. దాబా హోటల్‌ను ధ్వంసం చేసి సామాన్లు బయటపడేయడంతో స్థానికులకు, బయట నుంచి వచ్చిన ప్రైవేట్ వ్యక్తులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బలవంతంగా హోటల్‌ను ఖాళీ చేయించడంతోపాటు కత్తులతో బెదిరించారంటూ హోటల్ యజమాని దగదర్తి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


హోటల్‌లోని వస్తువులను బయట పడేసిన దృశ్యం